క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ గుర్రంగూడ, ఆదిత్యానగర్ ఫీడర్ కింద చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంటల వరకు గుర్రంగూడ ఫీడర్ పరిధి పోస్టల్ కాలనీ, గోల్డ్ ఫేజ్ కాలనీ, జక్కిడి సత్తిరెడ్డి కాలనీ, సావిత్రమ్మ కాలనీ, బాబిర్ రెడ్డి కాలనీ, వేంకటేశ్వర కాలనీ, శ్రీనివాసపురం కాలనీ, గాద్వి ఎన్‌క్లేవ్, వినాయకనగర్, శ్రీకృష్ణ కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ, బృందావనం కాలనీలో సరఫరా నిలిపివేయనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి ఆదిత్యానగర్ ఫీడర్ కింది ఆదిత్యానగర్, జయసూర్యపట్నం, లక్ష్మీనగర్, జీబీఆర్ కాలనీ, శ్రీశ్రీ అవెన్యూ, గుర్రంగూడ గ్రామం, ఎస్‌బీఆర్ కాలనీ, సాయిదుర్గా కాలనీ, సాయిహోమ్స్, టీచర్స్ కాలనీ, టీచర్స్ గ్రీల్డ్ కాలనీ, రాజలక్ష్మి కాలనీ, శ్రీలక్ష్మీ కాలనీ, మ్యాట్రిక్స్ రిచ్ వ్యాలిలో సరఫరాను నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



చిన్నారులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దాత

ఆమనగల్లు: మండల పరిధి మాలెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన కల్లు విక్రంరెడ్డి స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, గ్రామ కార్యదర్శి పవన్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు విజయ, అంగన్‌వాడీ టీచర్ రాములమ్మ, నాయకులు మహేశ్, కొండల్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, వెంకటస్వామి, యాదయ్య, నరేశ్, జంగయ్య పాల్గొన్నారు.

కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

కడ్తాల్: పేద ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా నాయకుడు లక్పతినాయక్, మాజీ సర్పంచ్ హంశ్య మోత్యానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధి గానుగుమార్లతండా పంచాయతీ పరిధి కానుగుబావితండా, పోచమ్మగడ్డతండాలలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అర్హులు ఆందోళన చెందవద్దని, దశలవారీగా అందరికీ ప్రభుత్వం ఇళ్లు కట్టి ఇస్తుందని తెలిపారు. రాజునాయక్, నగేశ్, తేజ్, రమేశ్, రాజేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కడ్తాల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు.. బాధితుడి అందజేశారు. ఆరు నెలల క్రితం మండల పరిధి న్యామతాపూర్‌కు చెందిన లక్ష్మయ్య, మండల కేంద్రంలో సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. అదే రోజు ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్) అప్లికేషన్‌ను ఉపయోగించి, పోయిన మొబైల్ ఆచూకీ తెలుసుకున్నారు. అనంతరం సోమవారం బాధితుడు లక్ష్మయ్యకు సీఐ గంగాధర్ అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

యాచారం: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, అందులో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ అన్నారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా మొండిగౌరెల్లి గ్రామంలో సోమవారం ఆ పార్టీ శ్రేణులు.. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశ ఐక్యత, దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తుగా ఏటా ఐదేసి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు యాదగిరిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రవీందర్, మాజీ ఉప సర్పంచ్ జంగయ్య, నాయకులు సత్తయ్య, వెంకటేశ్, యాదయ్య, శ్రీనువాస్‌గుప్తా, సందీప్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో విజయం సాధ్యం

ఆమనగల్లు: ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం సాధ్యమని సీఐ జానకీరాం రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, అల్కాహాల్, కల్తీకల్లు సేవించడం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితే భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందని తెలిపారు. అనంతరం డ్రగ్స్ వలన కలిగే అనర్థాల గురించి పేర్కొన్న పోస్టర్లను ఆవిష్కరించారు.

నిరీక్షించి.. నీరసించి

వైద్యసేవలు అందక రోగుల విలవిల

- వేధిస్తున్న సీజన్ వ్యాధులు
- రోగులతో ప్రభుత్వ ఆస్పత్రుల కిటకిట
- సమయపాలన పాటించని వైద్యులు
- 10.30 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు



యాచారం: పది గంటలు దాటినా రాని వైద్యుల కోసం రోగుల నిరీక్షణ

'ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ధర్మాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం' అని పాలకులు, వైద్యాధికారులు చెబుతున్నప్పటికీ.. అందులో వాస్తవం అంతంతమాత్రమేనని ప్రస్తుత పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. ముసురుతున్న రోగాలతో వైద్యమోనారాయణ అంటూ సర్కారు దవాఖాన గడపతొక్కిన రోగులకు పడిగాపులు తప్పడం లేదు. ఆరోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధులతో సతమతమవుతూ.. సమయపాలన పాటించని వైద్యుల కోసం నిరీక్షించి, మరింత నీరసించి పోతున్న వైనం సోమవారం 'సాక్షి' పరిశీలనలో వెలుగు చూసింది. సౌకర్యాల లేమి, అక్కడక్కడ ఔషధాల కొరత ఉండనేఉంది.

మండలానికి ఒకే పీహెచ్‌సీ



వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ మోహన్

మాడ్గుల: సీజన్ వ్యాధుల నేపథ్యంలో సర్కారు దవాఖానకు రోగులు తాకిడి పెరుగుతోంది. ఇంతకు ముందు రోజుకు 100 మంది వరకు రాగా.. ప్రస్తుతం 150కి పైగా పేషంట్లు వస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఎప్పటికప్పుడు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేస్తున్నామని వైద్యుడు మోహన్ పేర్కొన్నారు. డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధుల కేసులు లేవని తెలిపారు. ఇదిలా ఉండగా.. 34 గ్రామాలు ఉన్న మాడ్గుల మండలానికి.. మండల కేంద్రంలోని ఐదు పడకలు ఉన్న ఒక పీహెచ్‌సీ మాత్రమే ఉందని, జనాభాకు అనుగుణంగా 50 పడకలకు విస్తరించి, వైద్య సేవలు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

60 మంది రోగులకు.. ఒకరే



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

కడ్తాల్: మైసిగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సమయపాలన పాటించారు. డ్యూటీ డాక్టర్‌తో పాటు స్టాఫ్ నర్స్, నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు సకాలంలో విధులకు హాజరయ్యారు. ఒంటి నొప్పులు, తలనొప్పి, ఎలర్జీ, గ్యాస్ ట్రబుల్, బలహీనత, సాధారణ జ్వరంతో బాధపడుతున్న రోగులు సుమారు 70 మందికి వైద్య పరీక్షలు అందించామని అక్కడి సిబ్బంది తెలిపారు. నిత్యం ఓపీ పేషంట్స్ 60 నుంచి 70 మంది వరకు వస్తుంటారని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఇక్కడ ఒక్కరే వైద్యుడు పనిచేయడం గమనార్హం. ఆస్పత్రిలో నీటి సౌకర్యంతో పాటు, వాచ్‌మెన్, స్వీపర్ లేక ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది పేర్కొన్నారు.

వాంతులు, విరేచనాలు



ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుల కుర్చీలు

యాచారం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎప్పటిలాగే వైద్యుల నిర్లక్ష్యం పెనవేసుకుంది. ఉదయం 9 గంటలకు రావాల్సిన డాక్టర్లు.. పది గంటలు దాటినా రాకపోవడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. యాచారం మండల పరిధి గ్రామాల నుంచి జ్వరం, కాళ్లు, కీళ్లు, బీపీ, షుగర్, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ 30 మందికి పైగా వచ్చిన రోగులు.. పడిగాపులు కాశారు. అసలే అనారోగ్యంతో బాధపడుతూ.. గంటల కొద్ది నిరీక్షించి మరింత నీరసించారు. నెమ్మదిగా పదిన్నర గంటల తర్వాత వచ్చిన సిబ్బంది.. ఆలోపు అక్కడ ఉన్నవారిలో కొద్దిమందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేసి పంపించారు.

డయాలసిస్ సేవలు డల్



చికిత్స పొందుతున్న డయాలసిస్ రోగులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం 30 పడకల ఆస్పత్రి పేరుకే గొప్ప. ఇక్కడ 8 మంది వైద్యులు డిప్యుటేషన్‌పైనే విధులు నిర్వహిస్తున్నారు. వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి రాకముందు ఇక్కడ 24 గంటలు వైద్య సేవలు అందేవి. ప్రస్తుతం సాయంత్రం 4 గంటలు దాటితే వైద్యులు కనిపించరు. నిత్యం 200 వందల వరకు పేషంట్లు వచ్చే ఆస్పత్రికి రాత్రి వేళల్లో అత్యవసర కేసులు వస్తే చూసే వారే ఉండరు. గర్భిణులకు ఆపరేషన్ చేయాల్సి వస్తే.. నగరానికి రిఫర్ చేస్తారు. ఎక్స్‌రేలు, అల్ట్రాసౌండ్ పరికరాలు ఉన్నా.. పరీక్షించేందుకు సిబ్బంది లేరు. మలమూత్ర, రక్త పరీక్షలకు సాంపిల్స్ తీసుకొని, నగరంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్, కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్‌కు పంపుతారు. ఆ రిపోర్టుల ఆధారంగా మరుసటి రోజు రోగులకు చికిత్స అందిస్తున్నారు. షుగర్ పరీక్షలు ఇక్కడే చేసి, మందులు ఇస్తున్నారు. ఇక కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేసే కేంద్రానికి నీటి సమస్య వేధిస్తోంది. మూడు షిఫ్టుల్లో 32 మంది రోగులకు నిత్యం డయాలసిస్ చేస్తారు. మరో 18 మంది డయాలసిస్ చేయించుకునేందుకు ఎదురు చూస్తున్నారు. కానీ నీటి కొరత పెద్ద సమస్యగా మారింది.

అత్యవసర కేసులు నగరానికి



నిత్యం 200 మందికి పైగా ఔట్ పెషేంట్లు వస్తుంటారు. వారికి 8 వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో వైద్య సేవలందిస్తున్నాం. మందులకు ఇబ్బంది లేదు. ఆస్పత్రి అవసరాలు తీర్చేందుకు సరిపడా నీరు లేదు. పురాతన భవనం కావడంతో ఇబ్బందిగా ఉంది. కొత్త భవనం నిర్మిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయి. ప్రస్తుతం సాధారణ ప్రసవాలు ఇక్కడ చేస్తున్నాం. ఎమర్జెన్సీ కేసులకు ప్రథమ చికిత్స చేసి, నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నాం.

– డి.రాజ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇబ్రహీంపట్నం

నలుగురు ఉన్నా.. సమయపాలన సున్నా



ఓపీ రాయించుకుంటున్న రోగులు



చికిత్స కోసం రోగుల ఎదురుచూపు

ఆమనగల్లు: నలుగురు వైద్యులు ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో.. ఏ ఒక్కరు కూడా సమయపాలన పాటించలేదు. ఉదయం 10.30 గంటల తరువాత వైద్యుడు నాగరాజు వచ్చారు. ఆ తరువాత మైమునాబేగం, జయశ్రీ హాజరయ్యారు. అప్పటికే రోగులు పెద్ద సంఖ్యలో వైద్యం కోసం ఎదురు చూస్తున్నారు. సోమవారం 189 మంది పేషంట్లు ఆస్పత్రికి వచ్చారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, కావాల్సిన మందులు అందజేశారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయి.

గడువులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

కడ్తాల్: సర్పంచ్‌ల కాలవ్యవధి ముగిసి ఏడాదిన్నర అయినా.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. 2024లో సంఘం తరఫున మాజీ సర్పంచ్‌లు.. స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టును సంప్రదించారని తెలిపారు. సోమవారం కోర్టులో ఎన్నికల నిర్వహణపై వాద ప్రతివాదనలు జరిగాయన్నారు. సర్పంచ్‌ల తరఫున న్యాయవాది గుమ్మల భాస్కర్‌రెడ్డి.. తన వాదనలతో ఆర్టికల్ 243ఈ, 243కె ద్వారా సంక్రమించిన హక్కులను నీరుకారుస్తూ.. ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం, ఎన్నికల సంఘం కాలయాపన చేస్తుందని వివరించారు. వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘానికి సూచించినట్లు తెలిపారు. స్టాండింగ్ కౌన్సిల్ విద్యాసాగర్‌రావు, ప్రభుత్వం తరఫున మహ్మద్ ఓమర్ ఫరూఖ్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయడానికి ఆలస్యం అయిందని, తద్వారా ఎన్నికల నిర్వాహణకు కొంత సమయం కావాలని కోరినట్లు పేర్కొన్నారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి, ఎన్నికలు నిర్ణీత సమయంలో నిర్వహించేలా ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి ఆదేశిస్తామని చెప్పినట్లు తెలిపారు. తుది తీర్పు రిజర్వ్ చేసినట్లు చెప్పారు. పెండింగ్ బిల్లుల గురించి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించే లోపు బిల్లులు విడుదల చేయాలని, లేని పక్షంలో మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడించారు.

రైతు భరోసా సంబురాలను జయప్రదం చేయండి

కడ్తాల్: మండల కేంద్రాల్లో మంగళవారం నిర్వహించే రైతు భరోసా సంబురాలను జయప్రదం చేయాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పార్టీ శ్రేణులకు, రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపు మేరకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో.. రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసి, 1కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు సాగు సాయం అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లురవి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లురవి

మాడ్గుల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవిలు అన్నారు. సోమవారం మండల పరిధి కలకొండలో దాతలు చింతపల్లి వెంకటయ్య సహకారంతో ఈదమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాల యూనిట్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ప్రజలకు భద్రతా భావాన్ని కలిగిస్తాయని, కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని సూచించారు. అప్పుడే నేర రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు అవుతారని పేర్కొన్నారు. అనంతరం కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవిందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ రైతులకు 'భరోసా' కల్పించండి

- సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు సామెల్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ సునితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు, రైతులు

ఇబ్రహీంపట్నం: ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న రైతుల భూములకు పంట సాయం ఎందుకు ఆపారని, వారు పంటలు పండించడం లేదా? అని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు సామెల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో అర్హులందరికీ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. ధర్నా చేశారు. ఔటర్ పరిధిలో ఉన్న 9 మండలాలకు రైతు భరోసాను ఇవ్వకుండా వివక్షత చూపడం తగదన్నారు. ఉద్యాన పంటలు పండించి, నగరానికి సరఫరా చేస్తూ.. ఆర్థికంగా బలంగా ఉన్నారని పేర్కొంటూ సాయం ఆపడం సమంజసం కాదాన్నారు. రైతులు ఆందోళన చెందుతున్నారని, అర్హులందరికీ వారి ఖాతాల్లో సాగు సాయం నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ సునితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.జంగయ్య, పి.జగన్, మండల కార్యదర్శి బుగ్గరాములు, నాయకులు ఎల్లేష్, వెంకటేశ్, నర్సింహ్మా, పురుషోత్తం, భిక్షపతి, గణేశ్, ముసలయ్య, అశోక్, సైకిలాబ్, ఆనంద్, దాసు, మల్లేశ్‌లు పాల్గొన్నారు.

బుక్స్ విక్రయిస్తున్న స్కూళ్లపై చర్యలకు డిమాండ్

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీ, కార్యదర్శి ఏర్పుల తరంగ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని ఓ పాఠశాలలో బుక్స్ అమ్ముతుండగా వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం వారు మాట్లాడుతూ.. అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలను విద్యాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదే విషయమై మండల విద్యాధికారి హీర్యానాయక్ ఫిర్యాదు చేశామని, ఆయన వెంటనే పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, రాంచరణ్, వినయ్, ప్రణయ్, మనోహర్, రామ్, సాయిరామ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం

- అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



మంతన్‌గౌరెల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, దీనిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలం మంతన్‌గౌరెల్లి, మాల్, నల్లవెల్లి, చింతపట్ల, తమ్మలోనిగూడ గ్రామాల్లో సోమవారం రూ.రెండున్నర కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు రైతు భరోసా, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రంలో మూడు దఫాలుగా అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్‌లు రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని, కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

అధికారులు బాధ్యతగా ఉండాలి

ప్రజా సమస్యల పట్ల అధికారులు బాధ్యతతో పని చేయాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. మంతన్‌గౌరెల్లిలో తాగునీటి సమస్య, డ్రైనేజీ దుస్థితిపై ప్రజల ఫిర్యాదుతో అధికారులపై ఆయన మండిపడ్డారు. మాల్ గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 640 లోని ప్రభుత్వ భూమిలో నాలుగు ఎకరాలను పశువుల సంతకు కేటాయించే విధంగా కలెక్టర్, డీపీఓలకు నివేదిక అందజేస్తానన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ అయ్యప్పకు సూచించారు. అర్హులైన రైతులకు.. రైతుభరోసా నిధులు బ్యాంకు ఖాతాల్లో జమయ్యే విధంగా చూడాలని మండల వ్యవసాయ అధికారి రవినాథ్‌కు సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ నాయక్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, మాజీ వైస్ ఎంపీపీ రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే దృష్టికి తెండి

యాచారం: ఉద్యోగ పరంగా మీకు ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకరండి. కానీ అభివృద్ధి, సంక్షేమం పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించే సమయంలో ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, దాంతో మిమ్మల్ని అక్కడే మందలించాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. కానీ మిమ్మల్ని(అధికారులను) ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం లేదన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేరని, అధికారుల చేతుల్లోనే అంతా ఉందని, బాధ్యతగా వ్యవహరించి అభివృద్ధి, సంక్షేమ పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మాధవరావు, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ అయ్యప్ప, మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ నాయకులు సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అయ్యప్పకొండ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, నాయకులు నర్సింహ, రవిరాథోడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి



మొక్క నాటుతున్న సీఐ గంగాధర్

కడ్తాల్: మాదక ద్రవ్యాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీఐ గంగాధర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నివారణకు మండల కేంద్రంలో ఈ నెల 26న కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీకి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువజన సంఘాలు, ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. అదే విధంగా రాజ్యాంగంలో పొందుపరిచిన విధులను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటడంతో పాటు, ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇంద్రారెడ్డి, భీముడు, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు జ్ఞానేశ్వర్, రజనీకాంత్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, పోలీసు సిబ్బంది అఫ్రోజ్, రవి, శేఖర్, లావణ్య, దివ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి ముర్తుజపల్లి గ్రామానికి చెందిన కాలె మహేందర్ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, నాయకులు కర్నాటి శ్రీధర్‌రెడ్డి, శ్రీనునాయక్ తదితరులు సోమవారం గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు.